30-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు మీరు చాలా పెద్ద స్టీమర్ లో కూర్చుని ఉన్నారు, మీరు ఉప్పునీటి కాలువను దాటి క్షీరసాగరములోకి వెళ్తున్నారు, మీ లంగరు ఎత్తివేయబడింది"

ప్రశ్న:- పిల్లలకు విశేషంగా ఏ విషయములో అలసట కలుగుతుంది? అలసట కలిగేందుకు ముఖ్యమైన కారణము ఏమిటి?

జవాబు:- పిల్లలు నడుస్తూ-నడుస్తూ స్మృతి యాత్రలోనే అలసిపోతారు, ఇందులో అలసట కలిగేందుకు ముఖ్యమైన కారణము - సాంగత్య దోషము. ఎటువంటి సాంగత్యము లభిస్తుందంటే దాని వలన తండ్రి చేతిని వదిలేస్తారు. మంచి సాంగత్యము తీరానికి చేరుస్తుంది, చెడు సాంగత్యము ముంచేస్తుంది అని అంటారు. సాంగత్యములోకి వచ్చి స్టీమర్ నుండి కాలు కిందకు దించారంటే మాయ పచ్చిగానే తినేస్తుంది, అందుకే బాబా పిల్లలను అప్రమత్తం చేస్తారు - పిల్లలూ, సమర్థుడైన తండ్రి చేతిని ఎప్పుడూ విడిచిపెట్టకండి.

పాట:- మాతా ఓ మాతా...

ఓం శాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలకు చెప్తున్నారు - పిల్లలూ, ఓం శాంతి. దీనిని కూడా మహామంత్రము అని అంటారు. ఆత్మ తన స్వధర్మము యొక్క మంత్రాన్ని జపిస్తుంది. ఆత్మనైన నా స్వధర్మము శాంతి. నేను శాంతి కొరకు అడవులు మొదలైనవాటికి వెళ్ళాల్సిన అవసరం లేదు. ఆత్మనైన నేను శాంత స్వరూపాన్ని, ఇవి నా ఇంద్రియాలు. శబ్దం చేయడం, చేయకపోవడం, ఇది నా చేతిలో ఉంది. కానీ ఈ జ్ఞానం లేని కారణంగా ప్రతి ముంగిటా భ్రమిస్తారు. దీనికి సంబంధించి ఒక కథ కూడా ఉంది - ఒక రాణి మెడలో హారము ఉంది కానీ ఆమె మర్చిపోయారు, ఆమె తన హారము పోయింది అనుకుని బయట వెతుకుతూ ఉన్నారు. అప్పుడు ఎవరో - హారము మెడలోనే ఉందని చెప్పారు. ఈ ఉదాహరణ చెప్తారు. మనుష్యులు ప్రతి ముంగిటా భ్రమిస్తూ ఉంటారు కదా. సన్యాసులు మొదలైనవారు కూడా - మనసుకు శాంతి ఎలా లభిస్తుంది అని అంటారు కానీ ఆత్మలోనే మనసు, బుద్ధి ఉన్నాయి. ఆత్మ ఈ ఇంద్రియాలలోకి రావడంతో టాకీగా అవుతుంది. తండ్రి అంటారు - ఆత్మలైన మీరు మీ స్వధర్మములో ఉండండి. ఈ దేహపు సర్వ ధర్మాలను మర్చిపోండి. పదే-పదే అర్థం చేయించినా కానీ కొందరు - మమ్మల్ని శాంతిలో కూర్చోబెట్టండి, యోగం చేయించండి అని అంటారు. ఇలా అనడం కూడా తప్పు. ఒక ఆత్మ మరొక ఆత్మతో - నన్ను శాంతిలో కూర్చోబెట్టండి అని అంటుంది. అరే, మీ స్వధర్మము శాంతి కాదా? మీకు మీరే కూర్చోలేరా? నడుస్తూ-తిరుగుతూ మీరు స్వధర్మంలో ఎందుకు స్థితులవ్వటం లేదు? ఎప్పటివరకైతే దారిని చూపించే తండ్రి లభించరో, అప్పటివరకూ ఎవ్వరూ స్వధర్మంలో స్థితులవ్వలేరు. వారు ఆత్మయే పరమాత్మ అని అన్నారు కావున వారు స్వధర్మంలో స్థితులవ్వలేరు. ఈ అశాంత దేశములో ఇది మీ అంతిమ జన్మ. ఇప్పుడు మీరు శాంతి దేశములోకి వెళ్ళాలి, ఆ తర్వాత సుఖధామములోకి వెళ్ళాలి. ఇక్కడైతే ప్రతి ఇంటిలోనూ అశాంతి ఉంది. సత్యయుగములో ప్రతి ఇంటిలోనూ ప్రకాశము ఉంటుంది. ఇక్కడ అంధకారము ఉంది, ఇక్కడ ప్రతి విషయములోనూ ఎదురుదెబ్బలు తినాల్సి ఉంటుంది. ప్రతి ఇంటిలోనూ అంధకారము ఉంది, అందుకే దీపాన్ని వెలిగిస్తారు. ఎప్పుడైతే రావణుడు మరణిస్తాడో, అప్పుడు దీపావళిని జరుపుకుంటారు. అక్కడైతే రావణుడు ఉండడు కావున అక్కడ ఎల్లప్పుడూ దీపావళియే. ఇక్కడ ఇది రావణ రాజ్యమైన కారణంగా 12 నెలల తర్వాత దీపావళిని జరుపుకుంటారు. రావణుడు మరణిస్తాడు మరియు లక్ష్మీ-నారాయణుల పట్టాభిషేకం జరుగుతుంది. ఆ సంతోషాన్ని జరుపుకుంటారు. సత్యయుగములో లక్ష్మీ-నారాయణులు సింహాసనముపై కూర్చున్నప్పుడు పట్టాభిషేకం చేస్తారు. ఇప్పుడు రావణ రాజ్యం పూర్తవుతుందని మీకు తెలుసు. భారత్ కు మళ్ళీ రాజ్యభాగ్యము లభించనున్నది. ఇప్పుడు రాజ్యమేదీ లేదు. తండ్రి నుండి రాజ్యం లభించనున్నది. అనంతమైన తండ్రి అనంతమైన రాజధాని యొక్క వారసత్వాన్ని ఇస్తారు. తండ్రి అంటారు - నేను మీకు సదా సుఖ వారసత్వాన్ని ఇచ్చేవాడిని, మిగిలినవారంతా మీకు దుఃఖాన్ని ఇచ్చేవారే. అయితే కొందరు సుఖాన్ని ఇచ్చినా కూడా అది అల్పకాలికమైనది, క్షణభంగురమైనది. ఆ సుఖము కాకిరెట్టతో సమానమైనది. నేను మీకు ఎంతటి సుఖాన్ని ఇస్తానంటే, ఇక ఎప్పటికీ దుఃఖమనేది కలగనే కలగదు, అందుకే ఈ దేహ సహితంగా దైహిక సంబంధాలు ఉన్నవారిని మర్చిపోండి. ఈ దేహము మరియు దేహ సంబంధీకులు మీకు దుఃఖాన్ని ఇచ్చేవారు, వీరిని వదిలి నన్నొక్కరినే స్మృతి చేయండి. ఉదయం అమృతవేళలో స్మృతి చేయాల్సి ఉంటుంది. భక్తి మార్గంలో కూడా మనుష్యులు ఉదయం లేస్తారు. కొందరు ఒకరి మతము అనుసారంగా ఒకలా చేస్తారు, మరికొందరు మరోలా చేస్తారు? తండ్రి అర్థం చేయిస్తారు -

ఉదయమే లేచి ఎంత వీలైతే అంత స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రినైన నన్ను స్మృతి చేయండి. ఇది తండ్రి ఆజ్ఞ.

భక్తులు భగవంతుడిని తలచుకుంటారు కూడా, కానీ మళ్ళీ అందరూ భగవంతులే అని అనేస్తారు. ఇప్పుడు వారు అర్థం చేసుకోరు కానీ ఒకానొక రోజున వారందరూ మీకు మిత్రులుగా అవుతారు, ఈ విషయం సరైనది అని అంటారు. ఈశ్వరుడిని సర్వవ్యాపి అనడం అనగా స్వయం యొక్క మరియు భారత్ యొక్క నావను ముంచివేయడము. ఇంకొక విషయమేమిటంటే - భారత్ కు స్వరాజ్యమనే వెన్నను ఇప్పించేవారు తండ్రి, వారికి బదులుగా ఏ శ్రీకృష్ణునికైతే వెన్న లభిస్తుందో, ఆ కొడుకు పేరును పెట్టేసారు, కావున భారత్ కు వెన్నను అందించేవారు శ్రీకృష్ణుడు అని మనుష్యులు భావిస్తారు. తండ్రికి బదులుగా కొడుకు పేరు వేసి అనర్థం చేసేసారు. ఇప్పుడు మొత్తం ప్రపంచమంతటికీ శ్రీకృష్ణుడు భగవంతుడు కాలేరు. మనుష్యులు రావణుని మతముపై తమను తాము శాపితులుగా చేసుకున్నారు. తండ్రి నావికుడు, మీరందరూ నావలు. నా నావను తీరానికి చేర్చండి అని పాడుతారు కదా. ఇప్పుడు మీరు పెద్ద స్టీమర్ లో కూర్చున్నారు. చంద్రకాంత వేదాంతములో స్టీమర్ విషయం ఉంది. అది కూడా ఇప్పటికి సంబంధించిన విషయమే అలా తయారుచేయబడి ఉంది. మీరు స్టీమర్ లో ఆవలి తీరానికి వెళ్తున్నారు. విషయసాగరము నుండి అమృతములోకి అనగా క్షీరసాగరములోకి వెళ్తారు. ఏ విధంగా లండన్ లో ఉప్పునీటి కాలువను ఏ స్టీమర్ అయితే దాటి వెళ్తుందో, దానికి కానుక లభిస్తుంది. ఇక్కడైతే నరకము నుండి స్వర్గములోకి వెళ్ళాలి. విషయసాగరము ఉప్పు నీరు వంటిది. మీరు పెద్ద స్టీమర్ లో కూర్చుని ఉన్నారు. మీరు వెళ్ళడం ప్రారంభించారు, లంగరు ఎత్తివేయబడింది. మీరు వెళ్తూ ఉన్నారు, అటువైపుకు వెళ్ళాలి. స్టీమర్ లు వెళ్తూ-వెళ్తూ పోర్టు వద్దకు చేరుకుంటాయి. అక్కడ కొందరు దిగుతారు, కొందరు ఎక్కుతారు. కొందరు ఆహారపానీయాల కోసమని వెళ్ళి వెనుకే మిగిలిపోతారు. దీనిపై ఒక కథ తయారుచేయబడి ఉంది. కృష్ణుడిని బటుక్ మహారాజుగా వర్ణించారు (బటుక్ మహారాజు ఒక సాధువు, అతడిని శ్రీకృష్ణుని ఎడమ భాగంగా భావిస్తారు). అతను స్టీమర్ కు క్యాప్టెన్. అలా స్టీమర్ లో వెళ్తూ-వెళ్తూ కొందరు దిగిపోతే అక్కడ మాయా రూపీ కొండచిలువ కూర్చుని ఉంటుంది. మహారథులను కూడా మింగి తినేస్తుంది. చదువును వదిలేసారంటే నిశ్చయబుద్ధి కలవారిగా లేరని అర్థము. అప్పుడిక సాగరం మధ్యలో పడిపోతారు.

పక్షులు మరణిస్తే చీమల గుంపు వచ్చి వాటిని ఎత్తుకుపోవడాన్ని మీరు చూసారు. ఈ 5 వికారాల రూపీ భూతాలు పూర్తిగా పచ్చిగా తిని మింగేస్తాయి. దీనిపై పెద్ద కథ రాయబడి ఉంది. ఎవరైనా స్టీమర్ లో కూర్చున్నారు అనుకోండి - గ్యారంటీ కూడా ఇస్తారు, తమ ఫోటోను కూడా పంపిస్తారు. మళ్ళీ ఒకవేళ ఎవరి సాంగత్యములోనైనా పాడైపోతే చదువును వదిలేస్తారు, అప్పుడు ఆ ఫోటోను తిరిగి వారికి పంపించివేయడం జరుగుతుంది. ఈ సమయంలో మాయ తమోప్రధానముగా ఉంది. ఈశ్వరుడి చేతిని వదిలారంటే అసురులు పట్టుకుంటారు. ఈ విధంగా ఎంతోమంది నడుస్తూ-నడుస్తూ చేతిని వదిలి దిగిపోతారు. వీరిని క్రోధమనే భూతము, మోహమనే భూతము పట్టుకుంది అని సమాచారాలు వస్తాయి. మొదటైతే నష్టోమోహులుగా అవ్వాల్సి ఉంటుంది. మోహము ఒక్కరితోనే పెట్టుకోవాలి. ఇదే శ్రమ. మోహపు సంకెళ్ళు ఎన్ని ఉన్నాయి. ఇప్పుడు ఒక్కరితో బుద్ధియోగాన్ని జోడించాలి. ఏ విధంగా మనుష్యులు భక్తి చేసేందుకు కూర్చున్నప్పుడు బుద్ధి వ్యాపారము వైపుకు, ఇంటి వైపుకు వెళ్ళిపోతుంది. ఇక్కడ కూడా మీకు అలాగే జరుగుతుంది. నడుస్తూ-నడుస్తూ మీకు కొడుకు గుర్తుకొస్తాడు, పతి గుర్తుకొస్తారు. తండ్రి అంటారు - ఈ సంకెళ్ళ నుండి బుద్ధియోగాన్ని తొలగించి ఒక్కరినే స్మృతి చేయండి. ఒకవేళ అంతిమ సమయంలో ఇంకేదైనా గుర్తుకొచ్చినట్లయితే, అంతిమ సమయంలో ఎవరైతే పతిని స్మరిస్తారో... చివరిలో ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ గుర్తు రాకూడదు, అటువంటి అభ్యాసం చేయాలి. ఉదయాన్నే లేచి తండ్రిని స్మృతి చేయండి. బాబా, మేము మీ వద్దకు వచ్చాము, తప్పకుండా మేము స్వర్గాధిపతులుగా అవుతాము. తండ్రిని మరియు వారసత్వాన్ని అనగా అల్ఫ్ మరియు బే ను స్మృతి చేయాలి. అల్ఫ్ అనగా అల్లాహ్, బే అనగా రాజ్యాధికారము. ఆత్మ బిందువు. ఇక్కడ మనుష్యులు తిలకం పెట్టుకుంటారు, అయితే కొందరు బిందువు పెట్టుకుంటారు, కొందరు పొడవాటి తిలకాన్ని పెట్టుకుంటారు, కొందరు కిరీటము వలె పెట్టుకుంటారు, కొందరు చిన్న నక్షత్రము వలె పెట్టుకుంటారు, కొందరు వజ్రము వలె పెట్టుకుంటారు. తండ్రి అంటారు - నీవు ఆత్మవు. ఆత్మ నక్షత్రము వలె ఉంటుందని మీకు తెలుసు. ఆ ఆత్మలో మొత్తం డ్రామా యొక్క రికార్డు అంతా నిండి ఉంది. ఇప్పుడు తండ్రి ఆజ్ఞాపిస్తారు - నిరంతరము తండ్రినైన నన్ను స్మృతి చేయండి, ఇతరులందరి నుండి బుద్ధియోగాన్ని తొలగించండి. ఈ లక్ష్యాన్ని ఇంకెవ్వరూ ఇవ్వలేరు. తండ్రి అంటారు - మీ శిరస్సుపై జన్మజన్మాంతరాల పాపాలు ఉన్నాయి. అవి స్మృతితో తప్ప ఇంకే విధంగానూ భస్మం అవ్వవు. సదా ఆరోగ్యవంతులుగా అయ్యేందుకు తండ్రిని స్మృతి చేయాలి. సదా ఆరోగ్యవంతులుగా మరియు సదా ఐశ్వర్యవంతులుగా అయ్యే వారసత్వము తండ్రి నుండే లభిస్తుంది. ఆరోగ్యము-ఐశ్వర్యము ఉంటే ఇంకేమి కావాలి! ఆరోగ్యం ఉండి, ఐశ్వర్యం

లేకపోయినా ఆనందం ఉండదు. ఐశ్వర్యం ఉండి, ఆరోగ్యం లేకపోయినా కూడా ఆనందం ఉండదు. ఆత్మ మొదట తండ్రిని స్మృతి చేయాలి, అప్పుడు వికర్మలు వినాశనమవుతాయి మరియు 21 జన్మల కొరకు ఆరోగ్యం లభిస్తుంది మరియు స్వదర్శన చక్రధారులుగా అయినట్లయితే 21 జన్మల కొరకు ఐశ్వర్యం లభిస్తుంది. ఇది ఎంత సహజమైన విషయము. మనం 84 జన్మలు ఈ విధంగా తిరిగాము. ఇప్పుడు అందరూ బూడిదగా అవ్వనున్నారు, కావున వారిపై మనసు ఎందుకు పెట్టుకోవాలి? ఎవరైతే కొత్త ప్రపంచపు రాజ్యాధికారాన్ని ఇస్తారో, వారిపై మనసు పెట్టుకోవాలి. బాబా ఆత్మలతో ఈ విధంగా మాట్లాడుతారు - పిల్లలూ, ఇప్పుడు ఈ శరీరాన్ని మరచి స్వయాన్ని అశరీరిగా భావిస్తూ నన్ను స్మృతి చేయండి. ఈ శరీరము మీకు పాత్రను అభినయించేందుకు లభించింది. ఉదయాన్నే లేచి ఈ విషయాలు స్మరించాలి. ఏ ప్రియుడైతే మురికి కాలువను దాటించి తీసుకువెళ్తారో, వారిని స్మృతి చేయాలి, మిగిలినవారంతా విషయ సాగరములో మునిగిపోయేవారే. తండ్రి దాటించేవారు, వారిని నావికుడు, తోట యజమాని అని కూడా అంటారు. మిమ్మల్ని ముళ్ళ నుండి పుష్పాలుగా చేసి స్వర్గంలోకి పంపిస్తారు. ఇక తర్వాత స్వర్గంలో మీరు ఎప్పుడూ దుఃఖాన్ని చూడరు, అందుకే వారిని దుఃఖహర్త, సుఖకర్త అని అంటారు. హర హర మహాదేవ అని అంటారు కదా. శివుడినే అలా అంటారు. వీరు బ్రహ్మ, విష్ణు, శంకరులకు కూడా తండ్రి. ఆ తండ్రే 21 జన్మల కొరకు సుఖ వారసత్వాన్ని ఇస్తున్నారంటే వారిని స్మృతి చేయాలి కదా, దీనికి కావాల్సింది ధైర్యము. స్మృతి చేస్తూ-చేస్తూ అలసిపోతే ఇక నడవడమే ఆపేస్తారు. ఎటువంటి సాంగత్యము లభిస్తుందంటే, దాని వలన తండ్రిని విడిచిపెట్టేస్తారు, అందుకే మంచి సాంగత్యం తీరానికి చేరుస్తుంది, చెడు సాంగత్యము ముంచేస్తుంది అని అంటారు. బయటకు వెళ్ళడంతో చెడు సాంగత్యము లభిస్తుంది, కావున నషా ఎగిరిపోతుంది. కొందరేమో - బ్రహ్మకుమారీల వద్ద గారడి ఉంది, అది అంటుకుంటుంది, వారి వద్దకు వెళ్ళకండి అని అంటారు. పరీక్షలైతే వస్తాయి. 10 సంవత్సరాలు ఉండి కూడా సాంగత్యదోషంలోకి వచ్చేవారు ఎంతోమంది ఉంటారు. కాలు కింద పెట్టారంటే, మాయ పచ్చిగానే తినేస్తుంది. తండ్రి నుండి స్వర్గ వారసత్వం తప్పకుండా లభిస్తుందని కూడా నిశ్చయం ఏర్పర్చుకుంటారు. అయినా కానీ మాయ యొక్క పెద్ద తుఫానులు వస్తాయి. ఇది యుద్ధ మైదానము. అర్ధకల్పం మాయా రాజ్యం కొనసాగింది. ఇప్పుడు దానిపై విజయాన్ని పొందాలి. రావణుడిని కాలుస్తారు, అప్పుడు ఒకరోజు సంతోషాన్ని జరుపుకుంటారు. ఇవన్నీ కృత్రిమమైన సుఖాలు. అసలైన సుఖము సుఖధామంలో లభిస్తుంది. ఇకపోతే నరకం యొక్క సుఖము కాకిరెట్టతో సమానమైనది. స్వర్గములోనైతే సుఖమే సుఖము ఉంటుంది. మీరు సుఖధామం కొరకు పురుషార్థం చేస్తున్నారు. బాక్సింగ్ లో ఒక్కోసారి మాయ యొక్క గెలుపు, ఒక్కోసారి పిల్లల యొక్క గెలుపు జరుగుతుంది. ఈ యుద్ధము రాత్రి-పగలు కొనసాగుతుంది. గురువు చేతిని పూర్తిగా పట్టుకోవాలి. గురువు సర్వశక్తివంతుడు, సమర్థుడు. చేతిని వదిలారంటే ఇక సర్వశక్తివంతుడు కూడా ఏమి చేయగలరు? చేతిని వదిలారంటే ఇక సమాప్తమైనట్లే. స్టీమర్ యొక్క విషయము శాస్త్రాల్లో కూడా ఉంది. ఇప్పుడు స్టీమర్ వెళ్తుంది. ఇంకా కొన్ని రోజులు మాత్రమే ఉన్నాయి. వైకుంఠము ఎదురుగా కనిపిస్తుంది. చివరి సమయంలోనైతే ఘడియ-ఘడియ వైకుంఠము యొక్క దృశ్యాలను చూస్తూ ఉంటారు. ఏ విధంగా ప్రారంభంలో ఎంతో చూసేవారో, అలా చివరి సమయంలో కూడా ఎన్నో సాక్షాత్కారాలు జరుగుతాయి. ఎవరైతే ఇక్కడ ఉంటారో, ఎవరైతే ధైర్యముతో చేతిని పట్టుకుని ఉంటారో, వారే అంతిమ సమయంలో ఇవన్నీ చూస్తారు. ఆ సమయంలో కుమార్తెలు చెప్పడం మొదలుపెడతారు - బాబా, వీరు దాసీలుగా అవ్వనున్నారు, వీరు ఫలానాగా అవ్వనున్నారు అని. అప్పుడు - మేము దాసీగా అయిపోయాము అని బాధపడతారు. కష్టపడకపోతే మరి పరిస్థితి ఏమవుతుంది? అప్పుడు ఎంతగానో పశ్చాత్తాపపడవలసి ఉంటుంది. ప్రారంభంలో మీరు ఎన్నో ఆటపాటలను చూసారు. మేము ఏదైతే చూసామో... అన్న పాట ఉంది కదా. కావున ఎంతగా సమయం సమీపంగా వస్తూ ఉంటుందో, అంతగా అన్నీ తెలియజేస్తూ ఉంటారు, కానీ అప్పుడిక చదువైతే కొనసాగదు. తండ్రి అంటారు - మీకు ఎంతగా అర్థం చేయించాను, మీరు శ్రీమతంపై నడవలేదు కావున ఇటువంటి పరిస్థితి ఏర్పడింది, ఇప్పుడిక కల్ప-కల్పమూ ఈ పదవే లభిస్తూ ఉంటుంది, అందుకే బాబా అంటారు - మీ పురుషార్థం చేస్తూ ఉండండి, మాతా-పితలను ఫాలో చేయండి. కొందరు కుపుత్రులు కూడా ఉంటారు కదా. మాయకు వశమై విసిగిస్తే చాలా పెద్ద శిక్షను పొందుతారు, పదవి కూడా భ్రష్టమైపోతుంది. శిక్షలను కూడా కుమార్తెలు సాక్షాత్కారంలో చూసారు. ప్రపంచంలో ఉన్నది అసురీ సాంగత్యము మరియు ఇక్కడ ఉన్నది ఈశ్వరీయ సాంగత్యము. బాబా అన్ని విషయాలను అర్థం చేయిస్తారు, తర్వాత ఇంకెవరూ - మాకేమి తెలుసు అని అనకూడదు. వినాశన సమయంలో మనుష్యులు ఎంతగానో ఆర్తనాదాలు చేయడం మొదలుపెడదతారు. మీరు ఎన్నో సాక్షాత్కారాలను పొందుతూ ఉంటారు. వేటగానికి వేట, వేటకు మృత్యువు... ఈ విధంగా మీరు నాట్యం చేస్తూ ఉంటారు. వినాశనం తర్వాత మళ్ళీ మన మహళ్ళు ఎలా తయారవుతాయో మీరు చూస్తూ ఉంటారు. ఎవరైతే జీవించి ఉంటారో వారు అన్నీ చూస్తారు. తండ్రికి చెందినవారిగా అయిన తర్వాత మళ్ళీ వారిని విడిచిపెట్టినట్లయితే, సాక్షాత్కారాలను చూడలేరు. అచ్ఛా!

మధురాతి-మధురమైన 5000 సంవత్సరాల తర్వాత మళ్ళీ వచ్చి కలుసుకున్న సికీలధే పిల్లలకు నంబరువారు పురుషార్థానుసారంగా ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సమర్థుడైన తండ్రి చేతిని పట్టుకునే ఉండాలి, ఒక్క తండ్రిపైనే మనసు పెట్టుకోవాలి, ఉదయాన్నే లేచి స్మృతిలో కూర్చోవాలి.

2. సాంగత్యదోషము నుండి స్వయాన్ని రక్షించుకోవాలి. చెడు సాంగత్యంలోకి వచ్చి చదువును ఎప్పుడూ వదలకూడదు.

వరదానము:- సంతోషము అనే ట్యాబ్లెట్ లేక ఇంజెక్షన్ ద్వారా స్వయం యొక్క చికిత్సను స్వయమే చేసుకునే నాలెడ్జ్ ఫుల్ భవ

బ్రాహ్మణ పిల్లలు తమ అనారోగ్యానికి చికిత్స స్వయమే చేసుకోగలరు. సంతోషమనే ఔషధము సెకెండులో ప్రభావం చూపించే మందు. ఏ విధంగా డాక్టర్లు శక్తిశాలీ ఇంజెక్షన్ ఇవ్వగానే మారిపోతారో, అలాగే బ్రాహ్మణులు స్వయానికి స్వయమే సంతోషమనే ట్యాబ్లెట్ ను ఇచ్చుకున్నట్లయితే లేక సంతోషమనే ఇంజెక్షన్ ను ఇచ్చుకున్నట్లయితే, అనారోగ్యము యొక్క రూపము మారిపోతుంది. నాలెడ్జ్ యొక్క లైట్-మైట్ అనేవి శరీరాన్ని నడిపించడంలో ఎంతో సహాయం చేస్తాయి. ఏదైనా అనారోగ్యం వస్తే, అది కూడా బుద్ధికి విశ్రాంతిని ఇచ్చే సాధనము.

స్లోగన్:- ఎవరైతే మనస్సు యొక్క ఏకాగ్రత ద్వారా సర్వ సిద్ధులను ప్రాప్తి చేసుకుంటారో, వారే సిద్ధి స్వరూపులుగా అవుతారు.